క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

సత్తెనపల్లి: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈనెల 31న ఉదయం 11 గంటలకు పురపాలక సంఘ కౌన్సిల్ హాల్‌లో జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి సోమవారం తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో అజెండాలోని 24 అంశాలపై చర్చించి ఆమోదించడం జరుగుతుందన్నారు. సమావేశానికి ఎక్స్ అఫిషియోగా జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు హాజరవుతారన్నారు. అన్ని వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, సెక్షన్ హెడ్లు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

అయ్యప్ప మాలధారులకు భిక్ష ఏర్పాటు



నకరికల్లు: స్థానిక గంగమ్మతల్లి ఆలయంలో అయ్యప్ప మాలధారులకు 41రోజుల పాటు ఉచిత భిక్ష ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం భిక్ష ఏర్పాట్లలో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నకరికల్లు గ్రామంతో పాటు సమీప గ్రామాల్లోని పలువురు మాలధారులు భిక్ష కార్యక్రమంలో పాల్గొంటున్నారు. రోజుకు సుమారు 150 నుంచి 200 మంది అయ్యప్పలు భిక్షకు హాజరవుతున్నారని భక్తసంఘం వారు తెలిపారు. మాలధారులు, గ్రామస్తుల సహకారంతో ఈ కార్యక్రమం ముందుకు సాగుతుందన్నారు. సోమవారం మామిడిశెట్టి సుబ్బారావు కుటుంబసభ్యులు భిక్ష ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

గురు స్పందన పురస్కారాలు అందజేత



పెదకూరపాడు: ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏలూరులో జరిగిన గురు స్పందన పురస్కారానికి 75 త్యాళ్లూరు జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, పెదకూరపాడు జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణ ఎంపికయ్యారు. ఎమ్మెల్సీ సాజ్జి, ఏలూరు జిల్లా విద్యా శాఖ అధికారి శ్యామ్‌సుందర్, ఫౌండేషన్ చైర్మన్ ఈదా శామ్యూల్ రెడ్డి, పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి, రమణలను పల్నాడు జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు తిరుమలేష్, శ్రీనివాసరెడ్డి, ప్రముఖ విద్యా వేత్త శివరామయ్య, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

పేద విద్యార్థినికి 'వుయ్ ఆర్ విత్ యూ' చేయూత



సత్తెనపల్లి: పేద విద్యార్థినికి 'వుయ్ ఆర్ విత్ యూ' సంస్థ సోమవారం చేయూత నందించింది. పట్టణానికి చెందిన డి.సుప్రియ అనే వివాహిత కరోనా సమయంలో భర్తను కోల్పోయింది. ఆమె తన బిడ్డల చదువు మధ్యంతరంగా ఆగిపోతుందని ఆందోళన చెందుతున్న నేపథ్యంలో వుయ్ ఆర్ విత్ యూ సంస్థ ప్రతినిధులు చేయూత అందించేందుకు ముందుకు వచ్చారు. సుప్రియ కుమార్తె డి.బ్లెస్సీ పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఆ విద్యార్థిని ఫీజు రూ.19 వేలు సోమవారం వుయ్ ఆర్ విత్ యూ ప్రతినిధులు చెల్లించటంతో ఈ ఏడాది చదువుకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చదువుకునేందుకు వెసులుబాటు కలిగింది. ఆ విద్యార్థిని చదువుకు భవిష్యత్తులో కూడా మరింత సాయం చేస్తామని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సభ్యులు భవిరిశెట్టి ప్రదీప్, పెండ్యాల సందీప్, దేసు ప్రవీణ్, షేక్ అల్లాబఖ్షు, షేక్ రిజ్వాన్ తదితరులు ఉన్నారు.

కరాటే నేషనల్ చాంపియన్ షిప్‌లో విద్యార్థుల ప్రతిభ



సత్తెనపల్లి: గుంటూరు జిల్లా, మంగళగిరిలోని ఈద్గా షాదీఖానాలో కరాటే ఇన్విటేషనల్ నేషనల్ చాంపియన్‌షిప్ 29న నిర్వహించారు. ఈ టోర్నమెంటులో సత్తెనపల్లికి చెందిన షికోకాయ్ షిటోరియో కరాటే స్కూల్ విద్యార్థులు 12 మంది ప్రతిభ చూపారు. వ్యక్తిగత బాలికల కటా విభాగంలో ఎస్.ఎస్.ఎస్. అక్షర(గోల్డ్ మెడల్), ఎస్.శరణ్య (గోల్డ్ మెడల్), టి.నిఖిత (సిల్వర్ మెడల్), బి.అక్షయ (బ్రాంజ్ మెడల్), వ్యక్తిగత బాలుర కటా విభాగంలో ఎల్. కిరీట్ (గోల్డ్ మెడల్), టి.అఖిల్ (గోల్డ్ మెడల్), ఎస్.సాయిరాం రెడ్డి (సిల్వర్ మెడల్), కె.టి.ప్రకాష్ (సిల్వర్ మెడల్), ఎల్.గేష్టుఆషిత్ (బ్రాంజ్ మెడల్), ఎస్.కె.ఐదయతుల్లా (బ్రాంజ్ మెడల్), బి.సత్యనారాయణ (బ్రాంజ్ మెడల్), ఎస్ పవన్‌చౌదయ్య (బ్రాంజ్ మెడల్)లు సాధించిన విద్యార్థులను సెన్‌సాయ్ అనుముల రాంబాబు, షిహాన్ అనుముల రామయ్యలు సోమవారం అభినందించారు.

అమరావతిలో ట్రాఫిక్ కష్టాలు



అమరావతి గాంధీబొమ్మ సెంటరులో ట్రాఫిక్‌జామ్ అయిన దృశ్యం



దుర్గావిలాస్ సెంటర్‌లో ట్రాఫిక్ జామ్ అయిన దృశ్యం

అమరావతి: నిత్యం భక్తులతో, పర్యాటకులతో సందడిగా ఉండే ప్రఖ్యాత పర్యాటక కేంద్రం అమరావతిలో ట్రాఫిక్ ఎక్కువవటంతోపాటు అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. భక్తుల, సందర్శకుల వాహనాలే కాక ఇసుకతో వచ్చే భారీ వాహనాలు, గుంటూరు, సత్తెనపల్లి, విజయవాడల నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, స్కూల్‌బస్సులతో అమరావతి వీధులన్నీ నిండిపోతున్నాయి. అమరావతి చుట్టు పక్కల గ్రామాలకు వెళ్లే వాహనాలతో పాటు అమరావతి–గుంటూరు ఆటోలు మొత్తం సుమారు 300 అమరావతి కేంద్రంగా నడుస్తున్నాయి. అమరావతి, క్రోసూరు రోడ్డు ఇరుకురోడ్డు కావటంతో నిత్యం అనేక మార్లు ట్రాఫిక్‌జామ్ అయి వాహనచోదకులు ఘర్షణలకు దిగటం సర్వసాధారణంగా మారింది. దీంతో పాటు అమరావతిలోని ఎరువులు, సిమెంట్ దుకాణాల వద్ద సరుకును రోడ్డుపై వాహనాలు ఉంచి అన్‌లోడ్, లోడ్ చేయటం కూడా ట్రాఫిక్ కష్టాలకు మరో కారణంగా చెప్పవచ్చు. అమరావతి మెయిన్‌బజారు సుమారు 80 అడుగుల వెడల్పు ఉన్నా ప్రతి రోజు గాంధీబొమ్మ సెంటరు, దుర్గావిలాస్ సెంటర్‌లలో రోజుకి పది నుంచి పదిహేనుసార్లు ట్రాఫిక్ జామ్ అవుతుంది. అలాగే దుర్గావిలాస్ సెంటరులో గుంటూరు, క్రోసూరుకు ఆర్టీసీ బస్సులు, ఆటోలు నిలిపి ప్రయాణికులను ఎక్కించుకోవటంతో తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. మెయిన్ బజారుకు ఇరువైపులా తోపుడుబండ్ల వ్యాపారులు రోడ్డును ఆక్రమించడంతో 80 అడుగుల రోడ్డు కాస్తా 40 అడుగులకు కుదించుకుపోయింది. అలాగే దుకాణాలు, హోటళ్ల ముందు ద్విచక్రవాహనాల పార్కింగ్ ఇష్టారాజ్యంగా చేస్తుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుంది. పోలీసు అధికారులు నామమాత్రంగా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టినా ఎటువంటి ప్రయోజనం కనబడటం లేదు. ఇప్పటికైనా పోలీసు అధికారులు ప్రజలు పడుతున్న ట్రాఫిక్ కష్టాలపై దృష్టి సారించి అమరావతిలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కృషి చేస్తాం..



ఇటీవల అమరావతిలో అన్ని కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. సీసీ కెమెరాల ద్వారా అన్ని సెంటర్‌లలో ట్రాఫిక్ నిశితంగా గమనిస్తున్నాం. అలాగే తోపుడుబండ్ల వ్యాపారస్తులకు నోటీసులు ఇచ్చి కేసులు కూడా నమోదు చేశామన్నారు. సిబ్బంది లేమి వల్ల, పనిఒత్తిడి కారణంతో ఎక్కువ సమయం ట్రాఫిక్ నియంత్రణకు వినియోగించలేక పోతున్నాం. అమరావతి పుణ్యక్షేత్రంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు నూతన ప్రణాళికను రూపొందించామని త్వరలో అమరావతి పర్యాటక కేంద్రంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కృషి చేస్తాం.

ఎ.వి.బ్రహ్మం, సీఐ అమరావతి

ట్రాఫిక్ నిబంధనలు కఠినంగా అమలు చేయాలి..



అమరావతిలో మెయిన్‌రోడ్డుతో పాటు క్రోసూరురోడ్డులో ట్రాఫిక్ నిబంధనలు కఠినంగా అమలు చేయాలి. అలాగే దుకాణాలు, హోటళ్ల ముందు పార్కింగ్ సమస్యలకు యాజమాన్యాలను బాధ్యులు చేయాలి. అలాగే పోలీసు అధికారులు వారంలో ఒక రోజు వాహనదారులకు, చిన్న పిల్లల తల్లిదండ్రులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలి. ఆటోలు, బస్సులు క్రమపద్ధతిలో నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలి.

కారసాల కుమార్, స్థానికుడు రాజీవ్‌కాలనీ అమరావతి

మెయిన్‌రోడ్డులో ఆక్రమణలు తొలగించాలి..



అమరావతిలో అన్ని సెంటర్‌లలో పోలీసులు నిత్యం ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలి. మద్దూరు డౌన్, గాంధీబొమ్మ సెంటర్‌లలో ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అలాగే వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలి. కుదించుకుపోయిన అమరావతి మెయిన్‌రోడ్డులో ఆక్రమణలు తొలగించాలి.

బి.సూరిబాబు, సీపీఎం మండల కార్యదర్శి

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



బాధిత కుటుంబానికి రూ.2 లక్షల చెక్కును అందచేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: అగ్నిప్రమాద బాధిత కుటుంబాలను అన్నిరకాలుగా ఆదుకుంటామని ఇచ్చిన హామీ మేరకు సజీవదహనమైన 9 నెలల చిన్నారి తల్లి దండ్రులకు సోమవారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు రూ.2లక్షల సీఎం సహాయనిధి చెక్కు అందచేశారు. మండలంలోని పెదపాలెంలో ఈ ఏడాది జూన్ 14న జరిగిన అగ్నిప్రమాదంలో 8 పూరిపాకలు కాలిపోగా, ఊయలలో నిద్రిస్తున్న 9 నెలల జెర్రిపోతు పల్లవి అనే చిన్నారి సజీవదహనం అయిన విషయం తెలిసిందే. కాగా తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే నిరాశ్రయులైన కుటుంబాలను పరామర్శించి గృహాలు కోల్పోయినవారికి ఒక్కొక్కరికి రూ.5వేలు తక్షణ సహాయం అందించి పునరావాస చర్యలు తీసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు. చిన్నారిని కోల్పోయిన తల్లిదండ్రులను ఓదార్చి వారికి రూ.50వేలు అందచేశారు. ప్రభుత్వ పరంగా రావలసిన సహాయాన్ని త్వరలో అందచేస్తానని ఆ రోజే హామీ ఇచ్చారు. హామీ మేరకు ఎమ్మెల్యే క్రోసూరులోని పార్టీ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండు రూ.2లక్షల చెక్కును బాధిత కుటుంబానికి అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నారిని తేలేకపోయిన బాధితులకు అండగా ఉంటామని, ఏ అవసరం వచ్చినా నిర్భయంగా ఎవరి ప్రమేయం లేకుండా నేరుగా తన వద్దకు రావచ్చన్నారు. వారి మనోవేదనను అర్థం చేసుకోగలనని, అయిన వారి జీవనోపాధికి ఏలోటు రాకుండా అండగా ఉంటానని చెప్పారు. ఆయన వెంట క్రోసూరు మార్కెట్‌యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, సర్పంచ్ నెల్లూరి హరిబాబు, మాజీ సర్పంచ్ నెల్లూరి చంద్రబాబు, ఎంపీటీసీ నెల్లూరి శివకుమారి, మార్కెట్‌యార్డు డైరెక్టరు చిరుమామిళ్ల నరశింహారావు, వైస్ ఎంపీపీ గంగసాని బాబు పాల్గొన్నారు.

మృతి చెందిన రోజే వైఎస్సార్ బీమా మంజూరు

తక్షణ సహాయంగా రూ.10వేలు అందజేత



వైఎస్సార్ బీమా చెక్కు అందజేస్తున్న సర్పంచ్ సుభాని, వైఎస్సార్ సీపీ నాయకులు

అచ్చంపేట: మండలంలోని కస్తల గ్రామానికి చెందిన గుడేటి అప్పారావు(62) గుండెజబ్బుతో బాధపడుతూ గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందారు. వెంటనే వలంటీరు ద్వారా సచివాలయ సిబ్బంది స్పందించి వైఎస్సార్ బీమా లక్ష రూపాయలు మంజూరు చేశారు. తక్షణ సహాయంగా గ్రామ సర్పంచ్ షేక్ మహబూబ్ సుభాని రూ.10 వేలు మృతుని భార్య గుడేటి మరియమ్మకు అందచేశారు. మిగిలిన రూ.90 వేలు త్వరలో అందచేస్తామని చెప్పారు. మృతి చెందిన రోజే బీమా మంజూరు కావడం గతంలో ఎన్నడూ లేదని, మండలం చుట్టూ తిరిగి విసిగిపోయే పరిస్థితులుండేవని సర్పంచ్ అన్నారు. కానీ సీఎం జగన్ దయవల్ల గ్రామంలోనే సచివాలయం ఉండటం, వలంటీర్ వ్యవస్థ వల్లనే ఈ సౌలభ్యం కలిగిందని సర్పంచ్ తెలిపారు. ఆయన వెంట గ్రామ పార్టీ కన్వీనర్ చెన్నమల్లు రవి, షేక్ జాన్‌పీరా, హస్సన్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం



ప్రజలకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

పెదకూరపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజలకు ఆరోగ్యాన్ని ఇస్తుందని జెడ్పీటీసీ కంకణాల స్వర్ణకుమారి అన్నారు. మండలంలోని గారపాడు జెడ్పీ పాఠశాలలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణకుమారి మాట్లాడుతూ రాష్ట్రంలో పేద ప్రజలకు ఇంటివద్దకే వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ షేక్ మస్తాన్‌షరీఫ్, కంకణాల శివాజీ, మాజీ సర్పంచ్ గణేష్ మాధవరావు, మాజీ ఎంపీటీసీ గోలి యలమంద తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



దమ్మాలపాడులో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): ఎరువుల దుకాణాల్లో నిల్వ వివరాలను అందరికీ కనిపించేలా అందుబాటులో నోటీసు బోర్డుపై ఉంచాలని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ చెప్పారు. మండలంలోని మాదల, దమ్మాలపాడు గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి సోమవారం తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే ఎరువులను అమ్మాలని, అధిక ధరలకు విక్రయిస్తున్నట్లుగా సమాచారం అందితే సంబంధిత దుకాణ లైసెన్స్ రద్దు చేయటంతో పాటు దుకాణదారునిపై చర్యలు తీసుకుంటామన్నారు. నోటీసు బోర్డులో స్టాక్‌తో పాటు ధరల వివరాలు కూడా ఉంచాలని సూచించారు. సీజన్‌కు సరిపడా నిల్వలను అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ బిల్లు అందించాలన్నారు. దుకాణంలోని స్టాక్ రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. ఆమెతో పాటు వ్యవసాయశాఖ సిబ్బంది ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 11 మంది విద్యార్థులు ఎంపిక



అచ్చంపేట: జిల్లా స్కూల్ గేమ్స్‌లో వివిధ క్రీడలలో మండలంలోని కొండూరు జెడ్పీ హైస్కూలు విద్యార్థులు ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి జట్టుకు 11 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను సోమవారం పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పీఈటీ వి.వేమారెడ్డి మాట్లాడుతూ ఈ నెల 28న మందపాడులో జరిగిన క్రీడలలో తమ పాఠశాల విద్యార్థులు హాజరైనట్లు చెప్పారు. పోటీలు అండర్ 14, 17 విభాగాలలో జరిగాయన్నారు. సాఫ్ట్‌బాల్‌లో ఎం.ఆకాష్, బి.దేవదాస్, ఎ.దేవమణి,, ఎస్.బుజ్జి, ఎ.కావేరీలు ఎంపికైనట్లు చెప్పారు. బేస్‌బాల్‌లో బి.అర్జునరావు, బి.శ్రీవిద్య, ఎం.రత్నకుమారి, ఎస్.గౌరిలేఖ, బి.దేవదాసు, వి.ఆకాష్ ప్రతిభ కనబరచి రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీలు త్వరలో అండర్ 14 బేస్‌బాల్ పోటీలు కర్నూలు జిల్లా నంద్యాలలో, అండర్ 17 బేస్‌బాల్ పోటీలు గుంటూరులో జరుగుతాయన్నారు. అండర్ 14, 17 సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రకాశం జిల్లా, ఒంగోలులో జరుగుతాయని చెప్పారు. విద్యార్థులను అభినందించిన వారిలో ప్రధానోపాధ్యాయులు బి.విజయకుమారి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఉన్నారు.

స్కూల్ గేమ్స్‌లో జెడ్పీ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



పెదకూరపాడు: ఈనెల 28న నందిగామ జెడ్పీ పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్–14, అండర్–19 హాకీ ఎంపికల్లో పెదకూరపాడు జెడ్పీ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్–14కు షేక్ ఆసిఫా తబుసం, అండర్–19 విభాగంలో హారిక, షేక్ ఆసిఫాలు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రమణ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర హాకీ క్రీడలకు ఎంపికైన విద్యార్థులను ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, జెడ్పీటీసీ కంకణాల స్వర్ణకుమారి, సర్పంచ్ జి.రాజు, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ షేక్ రఫీ, ఉపాధ్యాయులు అభినందించారు. ఎంపికైన విద్యార్థులు తుని మండలం నక్కపల్లి గ్రామంలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయుడు నాగరాజు తెలిపారు.

బెల్లంకొండ తహసీల్దార్‌గా క్షమారాణి బాధ్యతల స్వీకరణ

బెల్లంకొండ: మండల తహసీల్దార్‌గా క్షమారాణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పెదకూరపాడు మండలంలో తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఆమె బదిలీపై బెల్లంకొండకు వచ్చారు. ఇప్పటి వరకూ బెల్లంకొండకు ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్ నిర్మల పనిచేశారు. నూతన తహసీల్దార్ క్షమారాణి మాట్లాడుతూ మండలంలో ప్రజలకు ఉన్న రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. జగనన్న భూ సర్వేపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. రెవెన్యూ సిబ్బంది సహకారంతో భూ సర్వే వేగంగా, విజయవంతంగా పూర్తయ్యేలా ప్రణాళికలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు

మంత్రి అంబటి రాంబాబు



కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేస్తున్న రాష్ట్ర మంత్రి అంబటి, బీపీసీఎల్ ప్రతినిధి

రాజుపాలెం: బడుగు, బలహీన వర్గాల పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు కొనియాడారు. మండలంలోని గణపవరం ఎస్సీ కాలనీలో బీపీసీఎల్(భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్) సహకారంతో కమ్యూనిటీ హాల్‌కు మంత్రి అంబటి స్థానిక నాయకులతో కలసి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీపీసీఎల్ వారు రూ.45 లక్షలు కమ్యూనిటీ హాల్‌కు నిధులు మంజూరు చేసినందుకు సంస్థను అభినందిస్తూ ప్రతినిధిగా వచ్చిన బీపీసీఎల్ జనరల్ మేనేజర్ వరప్రసాద్‌కు అభినందనలు తెలిపారు. పేదలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబాలు బాగు పడతాయనే ఉద్దేశంతో జగనన్న ఏ రాష్ట్రంలో ప్రవేశపెట్టని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చి ఇంటింటికి వైద్యం అందించారని తెలిపారు. పేద పిల్లలు ఉన్నత చదువులు చదవాలని నాడు–నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తీసుకొచ్చారని అన్నారు. ప్రజల ముంగిటకే పరిపాలన తీసుకొచ్చారని కొనియాడారు. నిష్పక్షపాతంగా పనిచేసిన జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి దీవించాలని కోరారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి బాసు లింగారెడ్డి, సీనియర్ నాయకులు లాయర్ సూరిబాబు జగనన్న ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను సుదీర్ఘంగా వివరించారు. ఆలోచన చేసి మరలా జగనన్నను, అంబటి రాంబాబును దీవించాలని కోరారు. ముందుగా కొండమోడులో ముస్లిం మైనార్టీలకు రూ.30 లక్షలతో నిర్మించే షాదీఖానాకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సభ అధ్యక్షులు మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి చంద్రమౌళి, సర్పంచ్ బొలమాల నాగమల్లేశ్వరరావు, ఎంపీటీసీ నందనం, మాజీ సర్పంచ్ వెంకటరమణబుల్లిబాబు, మండల ఎస్సీ సెల్ కన్వీనర్ సీతారాములు తదితరులు ఉన్నారు.

పవన్ కళ్యాణ్‌ను నమ్మి యువత మోసపోవద్దు
కాపులు ఆలోచించుకోవాల్సిన సమయం ఆసన్నమైంది

సత్తెనపల్లి: చంద్రబాబు పవన్‌కళ్యాణ్ భుజాల మీద ఎక్కి అధికారంలోకి రావాలని చూస్తున్నాడని, పవన్ కళ్యాణ్‌కి ఎన్ని సీట్లు ఇస్తాడో తెలియదని, పవన్ ఎన్ని తీసుకుంటాడో ఆయనకే తెలియదని, ఇది ఒక్క చంద్రబాబుకు మాత్రమే తెలుసు. పవన్‌కళ్యాణ్ దుర్మార్గమైన రాజకీయాలు చేస్తున్నాడని, ముఖ్యంగా కాపులు, కాపు యువత అట్రాక్ట్ అయ్యి మోసపో వద్దని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో జనసేన నాయకుడు రాయుడు బాలకృష్ణ, మిత్ర బృందం వైఎస్సార్ సీపీలో చేరిన సందర్భంగా సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు జైల్లో ఉంటే వాళ్ల కుటుంబ సభ్యులు, వారి పార్టీ వాళ్లు తప్ప ఎవరూ వెళ్లలేదన్నారు. రజనీకాంత్ వస్తాడన్నారు ఆయన రాలా! మాజీ ముఖ్యమంత్రులు వస్తారు, దేశంలోనే చక్రం తిప్పినటువంటి వ్యక్తి చంద్రబాబు అని పుకార్లు పెట్టి, ప్రచారం చేశారన్నారు. టీవీలలో బైట్స్ పెట్టి రండి రాజమండ్రి జైలులో మా చంద్రబాబును పలకరించండి అని కోరినా ఒక్కరూ రాలేదన్నారు. అవినీతికి పాల్పడిన వాడిని పలకరించటానికి అందరూ ముఖం చాటేశారన్నారు. కానీ మన పవన్ మాత్రం ముఖం చాటేయలేదని, ఇరగ దీసుకుంటూ వెళ్ళాడని, చంద్రబాబుతో మాట్లాడి బయటకు వచ్చి జగన్‌మోహన్‌రెడ్డిని అధికారంలో నుంచి దించుతామని, చంద్రబాబును అధికారంలోకి ఎక్కిస్తామని, ఇద్దరం కలిసే వెళుతున్నాం అని ప్రకటన చేసిన రోజున పవన్ కళ్యాణ్ అభిమానులు, నిజంగా ఆయన ముఖ్యమంత్రి కావాలని ఎవరైతే ఆశపడుతున్నారో వారందరూ ఒక్కసారి అవాక్కయిన సందర్భమన్నారు. జనసైనికులు అందరికీ మనవి చేస్తున్నానని ఈ రాష్ట్రం బాగు పడాలంటే, అభివృద్ధి చెందాలంటే, సంక్షేమ కార్యక్రమాలు అమలు జరగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని జనసైనికులు తెలుసుకోవాలన్నారు. పవన్ కళ్యాణ్ మాట విని రాజకీయాల్లోకి వెళితే కుక్కతోక పట్టుకొని గోదారి ఈదినట్లేనన్నారు. పవన్ కళ్యాణ్‌కు రాజకీయాలు తెలియవని మనవి చేస్తున్నానన్నారు. అప్పుడప్పు వచ్చి పోయే వ్యక్తి అన్నారు. ఎప్పుడో ఖాళీ ఉన్నప్పుడు, షూటింగ్ లేనప్పుడు వచ్చి రాజకీయాలు మాట్లాడి వెళతాడన్నారు. నీ పార్టీ నువ్వు పెట్టుకో .. నీ పార్టీని నువ్వు అభివృద్ధి చేసుకో తప్పు లేదు, కానీ ఎవరి అభివృద్ధి కోసమో నువ్వు తాపత్రయ పడటం దుర్మార్గమైన రాజకీయమన్నారు. ఆ రాజకీయంలో ముఖ్యంగా కాపులు, కాపు యువత భాగస్వాములై రాష్ట్రాన్ని నాశనం చేయొద్దని మనవి చేస్తున్నానన్నారు. పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి కావాలని ఆశపడ్డ కాపు యువకులు, సోదరులు చంద్రబాబును ముఖ్యమంత్రి చేయడానికి సిద్ధపడతారా? లేక రాష్ట్రాన్ని రక్షించుకోవడానికి జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేస్తారా అని కాపులు ఆలోచించుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రాయుడి బాలకృష్ణ పవన్ కావాలని నమ్మి జనసేనలో పని చేసినటువంటి వ్యక్తి అని, ఇవాళ ఆలోచన చేసుకొని ఇక జనసేన తెలుగుదేశంతో కలిశాక జనసేనలో ఉండటం అనవసరం అనే అభిప్రాయంతో వచ్చాడన్నారు. క్రియాశీలకంగా పని చేసి రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ, నియోజకవర్గంలో తన గెలుపు కోసం కృషి చేయాలన్నారు.

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకించండి



సత్తెనపల్లి: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని, సీపీఎం పార్టీ నిర్వహిస్తున్న ప్రజారక్షణ భేరి బస్సు యాత్ర జయప్రదం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమల పిలుపునిచ్చారు. పట్టణంలోని 17వ వార్డు శాలివాహన నగర్‌లో సోమవారం నిర్వహించిన గ్రూప్ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సమావేశానికి సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు ఎం.హరి పోతురాజు అధ్యక్షత వహించి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలపై భారాలను మోపుతూ ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. గతంలో రూ.450కు గ్యాస్ సిలిండర్ వచ్చేదని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. నిత్యావసర వస్తువులు సామాన్య ప్రజానీకం కొనే పరిస్థితి లేదని, ఈ ఏడాది వర్షాలు లేక వ్యవసాయ పనులు కూడా నామ మాత్రంగానే ఉన్నాయన్నారు. భవన నిర్మాణ కార్మికులకు సరిగా పని దొరకట్లేదని, ఈ కష్టకాలంలో సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం ఎలా బతకాలి అని ఆయన వాపోయారు, అంతే కాకుండా మహిళలపై దాడులు ఈ మధ్యకాలంలో ఎక్కువ అవుతున్నాయన్నారు. దీనిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టడానికి, ఈనెల 31న కర్నూలు జిల్లా ఆదోనిలో ప్రారంభమవుతున్న ప్రజారక్షణ భేరి బస్సు యాత్రను జయప్రదం చేయాలని, నవంబర్ 7వ తేదీ సత్తెనపల్లి తాలూకా సెంటర్‌లో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా బస్సు యాత్ర కరపత్రాలను వార్డులో పంపిణీ చేశారు. సీపీఎం పార్టీ పట్టణ కార్యదర్శి ధరణికోట విమల, కమిటీ సభ్యులు రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

యడ్లపాడు: గడ్డిమందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...సొలస గ్రామానికి చెందిన పేరం కోటేశ్వరమ్మ కొంతకాలంగా పలు వ్యాధులతో బాధపడుతోంది. అనారోగ్య సమస్యల కారణంగా ఈనెల 28న ఆమె ఇంట్లో గడ్డిమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం ఆమె మృతి చెందింది. మృతురాలి కుమారుడు చిన్న వెంకటరెడ్డి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు చేసినట్లు పోలీసులు తెలిపారు.